క్లుప్తంగా

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



గన్నవరం: కార్మికులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.జయలక్ష్మి సూచించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ కార్మిక హక్కుల రక్షణకు పలు చట్టాలు ఉన్నాయని చెప్పారు. కార్మికులు తప్పకుండా లేబర్ బోర్డులో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని గుర్తింపు కార్డు పొందాలని తెలిపారు. ప్రమాదాలకు గురైనప్పుడు గాయపడిన, మరణించినా పరిహారం పొందవచ్చని చెప్పారు. బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమన్నారు. రూ. 3 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్నవారికి, పిల్లలు, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత న్యాయ సాయం అందించనున్నట్లు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరివీధి వెంకయ్య, ప్రధాన కార్యదర్శి జాస్తి తాతారావు, సీనియర్ న్యాయవాదులు శారద, అనుమోలు వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సీహెచ్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్‌ను అనధికారికంగా వినియోగిస్తే కఠిన చర్యలు

రామవరప్పాడు: విద్యుత్‌ను అనధికారికంగా వినియోగించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆ శాఖ ఆపరేషన్ ఈఈ పి. హరిబాబు అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో విద్యుత్ ఈఈ, ఏఈలు బృందాలుగా ఏర్పడి గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. వీటిలో గృహ వినియోగం 7-, వాణిజ్య వినియోగ సర్వీసులు 11, పరిశ్రమలు 1లో అదనపు లోడు వినియోగించడాన్ని, పలువురికి మల్టిపుల్ సర్వీసులు ఉండటాన్ని గుర్తించి కేసులు నమోదు చేసి జరిమానా విధించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఈఈ జి. కమలకుమారి, డెప్యూటీ ఈఈ నవీన్, బాలాజీ, గుణదల డివిజన్ పరిధిలో ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శివలింగ ప్రతిష్ఠా మహోత్సవం

గన్నవరంరూరల్: మండలంలోని ముస్తాబాద-సూరంపల్లి గ్రామాల మధ్య ఉన్న శ్రీ సంజీవని వీరాంజనేయ స్వామి దేవస్థానం ఆవరణలో గురువారం భక్తులు శివలింగం, నందీశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠను భక్తిశ్రద్ధలతో చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, హోమాలు, వేద ఘోషతో ఆలయ ప్రాంతం మార్మోగింది. ఇదే సందర్భంలో నాగపడగలు, ఆంజనేయస్వామి వాహనం ఒంటెను ప్రతిష్ఠించారు. ముస్తాబాదకు చెందిన భక్తులు పెనుగొండ రామారావు, గాంధీ, శేఖర్‌రావు, సముద్రాల రమాసత్యనారాయణ వరప్రసాద్ దంపతులు పూజల్లో పాల్గొని ప్రతిష్ఠ చేశారు. ముస్తాబాద, సూరంపల్లి గ్రామాల్లోని భక్తులు వేడుకల్లో పాల్గొన్నారు.

పెదపులిపాకలో శతాధిక వృద్ధుడి మృతి



పెనమలూరు: పెదపులిపాకలో శతాధిక వృద్ధుడు మృతి చెందారు. గ్రామానికి చెందిన పోలవరపు సూర్యనారాయణ (103) వృద్ధాప్యంతో గురువారం కన్ను మూశారు. ఆయన 1920లో జన్మించారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మొత్తం కుటుంబ సభ్యులు 60 మంది ఉన్నారు. ఆయన మృతిపై గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: కానూరు పప్పులమిల్లు వద్ద బందరురోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలుకావడంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. యనమలకుదురు ఇందిరానగర్ 1కు చెందిన పసుపులేటి సురేంద్రకుమార్ ప్రైవేటు బస్సు డ్రైవర్. అతను ద్విచక్ర వాహనంపై కానూరు పప్పులమిల్లు వద్ద బందరు రోడ్డుపై వెళ్తున్నాడు. వెనుక నుంచి వచ్చిన జేసీబీ అతన్ని ఢీ కొట్టింది. ఘటనలో సురేంద్రకుమార్ తలకు గాయమై రక్తస్రావమైంది. అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని పోరంకిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. బాధితుడి సోదరుడు శివకుమార్ ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆస్తి కాజేసేందుకు యత్నం.. ఐదేళ్ల జైలు

గన్నవరం: డాక్యుమెంట్‌లో మార్పులు చేసి ఆస్తిని కాజేసేందుకు ప్రయత్నించిన వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 10 వేలు జరిమానా విధిస్తూ గన్నవరం 12వ అదనపు మేజిస్ట్రేట్ కోర్టు గురువారం తీర్పు ఇచ్చింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి. ప్రసన్న సమాచారం ప్రకారం.. విజయవాడ రూరల్ మండలం గూడవల్లికి చెందిన దేవరపల్లి టానీకి ఆమె తండ్రి సొంగా రాజరత్నం నుంచి 1.13 ఎకరాలు భూమి సంక్రమించింది. సదరు భూమిలో 50 సెంట్లు కుమారుడు విజయవర్మ, కుమార్తెలకు గిఫ్ట్‌డీడ్ రిజిస్ట్రేషన్ చేయగా, మిగిలిన భూమి ఆమె పేరునే ఉంది. అయితే టానీ 2012లో మృతి చెందగా, సొంగా క్రిస్టియన్ అనే వ్యక్తి ఆస్తిలో వాటా ఉందంటూ దొంగ డాక్యుమెంట్లు సృష్టించారని విజయవర్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారణ 12వ ఏఎంఎం కోర్టులో కొనసాగుతుండగా నేరం రుజువు కావడంతో పైవిధంగా తీర్పు ఇచ్చారు.

సంక్షేమ పాలనకు.. జగన్ కావాల్సిందే..



జగన్ ఎందుకు కావాలంటే బ్రోచర్లను కంకిపాడులో ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



వణుకూరులో పార్టీ జెండాను ఎగరవేస్తున్న గోసాల సర్పంచి సంగెపు శ్రీనివాసరావు



సభలో మాట్లాడుతున్న ఎంపీపీ అనగాని రవి

కంకిపాడు: సంక్షేమ పాలన కొనసాగాలంటే రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిందేనని వక్తలు స్పష్టం చేశారు. కంకిపాడు-1 సచివాలయంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, పార్టీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు మాట్లాడుతూ గతంలో పాలకులు ప్రజల్ని వంచిస్తే, నేడు జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమపాలన అమలు చేస్తున్నారన్నారు. సచివాలయం నుంచి పద్మావతి నగర్‌లోని సచివాలయం-1 ప్రాంగణానికి ర్యాలీగా వచ్చి, అక్కడ వైఎస్సార్ సీపీ జెండా ఎగరవేశారు. అనంతరం సంక్షేమ పాలనపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, వైస్ ఎంపీపీ ధూళిపూడి కృష్ణకిషోర్, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, దుర్గగుడి బోర్డు మాజీ సభ్యుడు నెరుసు సతీష్, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, డైరెక్టర్ జొన్నలగడ్డ నాగేశ్వరరావు, సీహెచ్‌సీ చైర్మన్ మేదంశ్రావు కుటుంబరావు, నాయకులు తంబాబత్తుల ఓంకారం, కరీముల్లా, మల్లు, ఏఎంసీ డైరెక్టర్ మరియబాబు తదితరులు పాల్గొన్నారు.

జగన్ వస్తేనే ప్రజలకు సంక్షేమ పథకాలు

పెనమలూరు: రాష్ట్రంలో జగన్ తిరిగి అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు ఉంటాయని పెనమలూరు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, గోసాల సర్పంచి సంగెపు శ్రీనివాసరావు అన్నారు. ఏపీకి జగనే ఎందుకుకావాలిలో భాగంగా వణుకూరులో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వల్లే నరసింహారావు, గద్దల రాజా తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అమలు చేశామని ఎంపీడీఓ సునీతాశర్మ అన్నారు. వణుకూరు సచివాలయం 2 పరిధిలో గురువారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం పరిధిలో నాలుగున్నరేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాల బోర్డును ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏఓ లోయ శివశంకరరావు, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నేతలు సంగపు శ్రీనివాసరావు, చక్క గోపీకృష్ణ, ఉపసర్పంచి గద్దల రాజా, వల్లే నరసింహారావు, వేమూరి రాజ తదితరుల పాల్గొన్నారు.

99.5 శాతం వాగ్దానాల అమలు

గన్నవరం: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల్లో 99.5 శాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని పలువురు ప్రజాప్రతినిధులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వై ఏపీ నీడ్స్ జగన్, పల్లెకు పోదాం స్థానిక గ్రామ సచివాలయం-1లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డును ఏఎంసీ చైర్‌పర్సన్ రామిశెట్టి అంజనీకుమారి, ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ గౌసాని ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కాసరనేని గోపాలరావు, వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనారాజుకుమారి, సర్పంచి నిడమర్తి సౌజన్య, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మన్నే సుందరరావు, మండల పార్టీ అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆకునూరు, ఉయ్యూరులో..

ఉయ్యూరు: మండలంలోని ఆకునూరులో గురువారం వై ఏపీనీడ్స్ జగన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎంపీపీ చీలి కల్పన, ఎంపీడీఓ విమాదేవి వైస్ ఎంపీపీ రాచాబత్తుల మధుసూదనరావు, పార్టీ మండల అధ్యక్షుడు, ఏఎంసీ వైస్‌చైర్మన్ దాసే రవి, ప్రధాన కార్యదర్శి గారపాటి నాని, పీఏసీఎస్ చైర్మన్ యార్లగడ్డ సాయి, ఉపసర్పంచ్ పాముల అనిల్, నాయకులు మేరుగుమాల ఏసుబాబు, శ్రీనివాసరావు, అశోక్ తదితరులతో కలిసి ఇంటింటికీ పర్యటించారు. సచివాలయాన్ని సందర్శించి ఆ గ్రామంలో జరిగిన అభివృద్ధిపై చర్చించి, సంక్షేమ బ్యానర్‌ను ఆవిష్కరించారు. గ్రామ కూడలిలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఉయ్యూరు పట్టణంలోని శ్రీలంక కాలనీలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, వైస్ చైర్మన్లు సోలే సురేష్ బాబు, అర్షతున్నీసాబేగం, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాం, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, కౌన్సిలర్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు తెనాలి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



ఆకునూరులో అభివృద్ధి పనుల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ చీలి కల్పన, ఎంపీడీఓ విమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గాంధీ

పేదల సంక్షేమమే ధ్యేయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ అన్నారు. బాపులపాడు మండలం పెరికీడులోని సచివాలయం ప్రాంగణంలో గురువారం 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ పల్లపోతు జాన్ ప్రకాష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. గాంధీ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి శేషగిరిరావు మాట్లాడారు. అనంతరం గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఇటీవల మృతి చెందిన మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నేత తవ్వా నరసింహమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగా భవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, వైస్ ఎంపీపీ పండు రాణి, సర్పంచ్ జాన్‌ప్రకాష్, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ పడకల వీర్రాజు, నేతలు నక్కా బాబు, పండు నాగార్జున, మెరుగుమాల వేణు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

పెనమలూరు: గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని పెనమలూరు శాఖ గ్రంథాలయ అధికారి పి.హరీష అన్నారు. ఆమె గురువారం వివరాలు తెలుపుతూ ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు 56వ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. 14వ తేదీన చాచానెహ్రూ జయంతి, 15న పుస్తక ప్రదర్శన, 16న పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, 17న చిత్రలేఖనం, 18న ఆటల పోటీలు, 19న మహిళలకు ముగ్గుల పోటీలు, 20వ తేదీ విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామని తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఉయ్యూరు: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఉయ్యూరు ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకూ డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఉంటుందని ప్రయాణికులు 9959224796 నంబర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

25న ఉయ్యూరు నుంచి అరుణాచలానికి ఆర్టీసీ సర్వీస్

ఉయ్యూరు డిపో నుంచి ఈ నెల 25న సూపర్ లగ్జరీ బస్సు శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, మీదుగా అరుణాచలం బయలుదేరుతుందన్నారు. టికెట్ ధర రూ.3 వేలుగా నిర్ణయించామని తెలిపారు. తిరిగి ఈనెల 28న బస్సు ఉయ్యూరు చేరుతుందని పేర్కొన్నారు.

నేడు కంకిపాడులో జగనన్నకు చెబుదాం

కంకిపాడు: మండల కేంద్రమైన కంకిపాడులో ఈ నెల 10వ తేదీ జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు గురువారం ఒక ప్రకటనలో కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల కేంద్రాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు ఈనెల 10న ఉదయం 10.30 గంటలకు పట్టణంలోని శ్రీ కృష్ణ కల్యాణ మండపంలో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రజలు తామెదుర్కొంటున్న సమస్యలపై వినతులు సమర్పిస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సమస్యలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి



ఉంగుటూరు: ధాన్యం కొనుగోలులో రైతులకు సమస్యలు రాకుండా కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి వి.హరీష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో సివిల్ సప్లయీస్ సిబ్బంది ఆధ్వర్యాన ధాన్యం కొనుగోలులో తీసుకోవలసిన జాగ్రత్తలపై గ్రామ వ్యవసాయ సహాయకులు(వీఏఏ), ధాన్యం కొనుగోలు కేంద్రాల టెక్నికల్ అసిస్టెంట్లకు అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఈ ఏడాది ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మండలంలో 25 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారని, సుమారు 76,000 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనాలు వేసినట్లు తెలిపారు. రానున్న రెండు వారాల్లో వరి కోతలు మొదలవుతాయని, ఈ సారి ధాన్యం కొనుగోలు ఆర్‌బీకేల ద్వారా చేపడుతున్నారని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సురక్షతో మెరుగైన వైద్య సేవలు

అంబాపురం(విజయవాడరూరల్): జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు అన్నారు. అంబాపురం గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సువర్ణరాజు మాట్లాడుతూ పేదలకు వైద్యసేవలను అందించడానికి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ ప్రారంభించగా, ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటికీ వైద్యసేవలందించడానికి 'సురక్ష' కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. అనేక సంక్షేమ పథకాలతో వైఎస్ కుటుంబం ప్రజలకు సేవలందించడంలో ముందు వరుసలో ఉందని కొనియాడారు. జనవరి నుంచి నిత్యం ఆరోగ్య సురక్ష కార్యక్రమంగా ప్రభుత్వం నిర్వహించనుందన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటే ప్రజలకు మరిన్ని సేవలందుతాయన్నారు. స్థానిక ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ కూడా గెలిపించుకోవాలన్నారు. సర్పంచి గండికోట సీతయ్య మాట్లాడుతూ గ్రామస్తులకు తాగునీటి సదుపాయం కల్పించాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం అతిథులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో రామవరప్పాడు సర్పంచి వర్రి శ్రీదేవి, పి.నైనవరం సర్పంచి బట్టా ఎంపీటీసీ సభ్యులు జోగా మల్లీశ్వరి, దూరి రత్నం, ఉపసర్పంచి ఎస్.శ్యామల, వార్డు సభ్యులు వసంత, రిటైర్డు మెడికల్ అధికారి భూషణమ్మ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం రోగులకు మందులు అందజేశారు.



అంబాపురంలో సురక్ష మందుల కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు

బొమ్ములూరులో మోటార్ల ఏర్పాటు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం బొమ్ములూరులో వరి పంటకు కృష్ణా-ఏలూరు కాలువ నుంచి సాగునీరు అందకపోవడంతో గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ సొంత ఖర్చులతో ప్రత్యేకంగా విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేశారు. బొమ్ములూరు, కండ్రిక గ్రామాల్లో పొట్ట, ఈత దశలో ఉన్న వరికి సరిగా సాగునీరు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రామానుజ పంపింగ్ స్కీం ఆయకట్టు సాగుదారులు ఇటీవల గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే వంశీ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన ఏలూరు కాలువ నుంచి సాగునీటిని తరలించడానికి సొంత నిధులు రూ. 5 లక్షలతో తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లు, 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లతోపాటు ప్రత్యేకంగా విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేశారు. దీంతో ఆయా గ్రామాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే వంశీకి కృతజ్ఞతలు తెలిపారు.



బొమ్ములూరులో ఎమ్మెల్యే వంశీ ఏర్పాటు చేసిన మోటార్లతో సాగునీరు సరఫరా చేపట్టిన రైతులు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

కంకిపాడు: ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకోవాలని కేడీసీసీబీ కంకిపాడు బ్రాంచి మేనేజర్ సౌమ్య సూచించారు. మండలంలోని ప్రొద్దుటూరులో కీర్తన కల్చరల్ సొసైటీ ఆధ్వర్యాన గురువారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పొదుపు ఖాతాలను తెరిచి ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు సొసైటీ సీఈఓ వెంకటప్పారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

టెలికం వినియోగదారుల భద్రతకు ప్రాధాన్యం

రామవరప్పాడు(గన్నవరం): టెలికం వినియోగదారుల రక్షణ, సౌకర్యాల కల్పనకు అనేక చర్యలు తీసుకుంటున్నామని ట్రాయ్ ప్రాంతీయ కార్యాలయ సలహాదారు బి. ప్రవీణ్‌కుమార్ అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో టెలికాం వినియోగదారులకు వారి హక్కులు, అధికారాల గురించి అవగాహన సదస్సును నిర్వహించారు.



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ టెలికాం ప్రాంతీయ కార్యాలయం విధులు, వినియోగదారుల రక్షణ గురించి తీసుకుంటున్న కార్యక్రమాల గురించి వివరించారు. టెలి కమ్యూనికేషన్ డైరెక్టర్ (డీఓటీ) మనోజ్ కుమార్ మాట్లాడుతూ ప్రజల్లో సెల్ టవర్ల రేడియేషన్‌పై అనేక అపోహలున్నాయన్నారు. ఈ అపోహలు తొలగించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐటీఎస్ జాయింట్ అడ్వైయిజర్ వీఎస్ రాజు, కళాశాల ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు, ఈసీఈ విభాగాధిపతి శ్రీ గౌరి, ఏఓ ప్రతాప్, సీఎజీ సభ్యులు పాల్గొన్నారు.

రాజీవ్‌నగర్‌లో రహదారి సమస్య తీరింది

మల్లికార్జున హైస్కూల్ నుంచి రాజీవ్‌కాలనీ వరకు రూ.40 లక్షలతో రోడ్డు నిర్మాణం

గన్నవరం: రాజీవ్‌నగర్‌కాలనీతో పాటు పరిసర ప్రాంత ప్రజలు దశాబ్దంన్నరగా ఎదుర్కొంటున్న రహదారి సమస్య తీరింది. ఈ ఘనత ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్‌కు దక్కుతుందని ఎంపీపీ అనగాని రవి పేర్కొన్నారు. స్థానిక శ్రీమల్లికార్జున హైస్కూల్ నుంచి రాజీవ్‌నగర్ కాలనీ వరకు సుమారు రూ. 40 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. సుమారు 15 ఏళ్ల క్రితం నిర్మించిన బీటీ రోడ్డు దెబ్బతినడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. దీనిపై స్థానికులు పంపిన ఫోన్ సందేశంపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వంశీమోహన్ రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకున్నారని చెప్పారు. మండల పరిషత్ నిధులు రూ. 30 లక్షలు, బుద్ధవరం గ్రామపంచాయతీ నిధులు రూ. 10 లక్షలతో పటిష్టంగా రోడ్డు నిర్మించినట్లు తెలిపారు. నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ వేగంగా రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేసిన కాంట్రాక్టర్ తుమ్మల చిన్నాను ఎంపీపీ అభినందించారు. మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య, ఎంపీటీసీ సభ్యులు త్రిపురనేని లక్ష్మీనరసింహారావు(బాబీ), పంచాయతీరాజ్ ఏఈ దాసు, కాలనీవాసులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీపీ, అధికారులు

పోరంకిలో గొలుసు దొంగతనం

పెనమలూరు: పోరంకిలో పట్టపగలు చైన్ స్నాచింగ్ జరిగింది. గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి లక్ష్మీనరసమ్మ గురువారం మధ్యాహ్నం స్టేట్ బ్యాంక్ ప్రాంతం నుంచి నడుచుకుంటూ గంగానమ్మ గుడి దాటి బంధువుల ఇంటికి వెళ్తున్నారు. ఆ సమయంలో అప్పటికే రోడ్డు పక్కన బైక్‌తో హెల్మెట్ ధరించి ఉన్న వ్యక్తి లక్ష్మీనరసమ్మపై ఒక్కసారిగా దాడి చేశాడు. ఆమె మెడలో ఉన్న 10 కాసుల రెండు బంగారు గొలుసులు తెంచుకుని బైక్‌పై పారిపోయాడు. దొంగ చేసిన దాడితో లక్ష్మీనరసమ్మకు గాయాలయ్యాయి. వైద్యులు చికిత్స చేసి ఆమెకు నాలుగు కుట్లు వేశారు. జనసంచారం ఉన్న ప్రాంతంలో మహిళపై దాడి చేసి బంగారు గొలుసులు తెంచుకొని పారిపోవడంపై స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఘటనా స్థలం వద్దకు సీఐ టి.వి.వి.రామారావు వచ్చి పరిశీలించి బాధితురాలితో మాట్లాడారు. ఆధారాలు సేకరించామని నిందితుడిని త్వరలో పట్టుకుంటామని సీఐ రామారావు తెలిపారు.

ప్రతి కుటుంబానికి వంద రోజుల పని దినాలు

ఉంగుటూరు: జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 100 రోజుల పని దినాలు కల్పించడమే లక్ష్యంగా పనులు గుర్తిస్తున్నారని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి ప్రణాళిక పనుల గుర్తింపు గ్రామ సభలు గురువారం పొట్టిపాడు, ఎస్‌పీ పేట, పాణుకుమాడు, పెద అవుటపల్లి గ్రామాల్లో నిర్వహించారు. పొట్టిపాడులో ఎంపీపీ పాల్గొని పలు సూచనలు చేశారు.

గ్రామ సభల ద్వారా 203 పనులు గుర్తించారని ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు కె.జ్యోతి, తిరుపతమ్మ, అన్నే సుబ్బలక్ష్మి, నాగరాజు, ఎన్‌ఆర్‌జీఎస్ ఏపీవో వినీల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా న్యాయ సేవల దినోత్సవం



ఉయ్యూరు: న్యాయ సేవల దినోత్సవాన్ని ఉయ్యూరులో గురువారం ఘనంగా నిర్వహించారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు, శ్రీ శ్రీనివాస విద్యాసంస్థల ఆధ్వర్యంలో న్యాయ సేవలపై అవగాహన కల్పిస్తూ గురువారం ర్యాలీ చేశారు. కోర్టు వద్ద నుంచి ప్రధాన సెంటరు వరకూ జరిగిన న్యాయ సేవా దినోత్సవ అవగాహన ర్యాలీని జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీహరి ప్రారంభించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఇస్మాయిల్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపీచంద్, విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాసరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పొలాల పరిశీలన



ఉంగుటూరు: బయో226 రకం వంగడం.. అగ్గితెగులు, దోమలను సమర్థంగా ఎదుర్కొని సుమారు 40బస్తాలు దిగుబడి వస్తుందని ప్రయోగాత్మకంగా నిరూపితమైందని మండల వ్యవసాయ శాఖ అధికారి వి.హరీష్‌కుమార్ తెలిపారు. ఇందుపల్లిలో నర్రా శ్రీమన్నారాయణ పొలంలో వ్యవసాయశాఖ నేతృత్వంలో ఆర్‌పీ బయో226 రకం వంగడం సాగు చేశారు. ఈ క్రమంలో పంట పొలాన్ని గురువారం వ్యవసాయశాఖ అధికారులు, సహాయకులు సందర్శించారు. సుమారు 40బస్తాలు దిగుబడి వస్తుందని రైతు నర్రా శ్రీమన్నారాయణ తెలిపారు.

కొత్త ఓటర్ల నమోదును క్షుణ్ణంగా పరిశీలించండి

విజయవాడరూరల్: కొత్తగా ఓట్లు నమోదైన వాటిపై క్షుణ్ణంగా పరిశీలన చేయాలని గన్నవరం నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి బి.చంద్రలీల పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బూత్‌స్థాయి అధికారుల సమావేశం జరిగింది. ఈఆర్‌ఓ మాట్లాడుతూ విజయవాడ రూరల్ మండలంలో కొత్తగా మూడు వేల ఓట్లు నమోదయ్యాయని, వారికి జనవరి 1వ తేదీ 2024 నాటికి 18 సంవత్సరాలు నిండాలని వాటిని పరిశీలించాలన్నారు. ఒకే డోర్ నెంబర్లో పది మంది ఓటర్ల కంటే అదనంగా ఉన్న వారి వివరాలను సేకరించి వారికి ప్రత్యేక డోరు నంబర్లు ఉండే విధంగా చూడాలన్నారు. జీరో డోరు నెంబరుతో నమోదైన ఓటర్ల వివరాలను సేకరించాలన్నారు. మండలంలో పోలింగ్ కేంద్రాల సంఖ్య 77 నుంచి 82వరకు పెంపుదల జరిగిందని, అవి అంబాపురం గ్రామంలో రెండు, ప్రసాదంపాడు గ్రామంలో మూడు చొప్పున వున్నాయని వాటిని కూడా పరిశీలించాలన్నారు. సమావేశంలో సహాయ ఎన్నికల నమోదు అధికారి కె.లక్ష్మి, డెప్యూటీ తహసీల్దార్లు గోపాలరెడ్డి, ఎండీ సలీం పాల్గొన్నారు.